
కథ

# హరివిల్లు

కె.వాసవదత్త రమణ

ఈ పండుగ వచ్చిందంటే నాకు లోలోపల చాలా భయం! ఎందుకంటే ఈ పండుగనాడే మా పిన్ని పోరు పడలేక మా నాన్న ఆత్మహత్య చేసుకున్నాడు. అంతేకాదు నా స్కూల్ క్లాస్ మేట్, నా బెస్ట్ ఫ్రెండ్ నళిని చనిపోయిన రోజది! ఇంకా అసలు విషయం సినిమా పిచ్చిలో, నేను రాజుతో హైదరాబాద్ పారిపోయి వచ్చి ఘోరంగా మోసపోయిన రోజు!!

ఈవాళ అదే రోజు! అందరు షాపుల్లో పూజలు చేస్తూంటే నేను ఎస్.టి.డి. షాపులో లైటు కూడా వేసుకోకుండా అలాగే చీకట్లో కూర్చున్నాను. గతం అంతా నా కళ్లముందు రీలులా తిరుగుతూ మనస్సంతా చిందర వందర చేస్తోంది! నా ఆలోచనల్ని భగ్నం చేస్తూ,



నీలం రంగు చుడీదార్ వేసుకున్న ఓ అమ్మాయి హడావుడిగా లోపలికి వచ్చి, "లోకల్ ఫోన్ ఏది?" అనడిగింది నన్ను స్టైలుగా! "ఆ ప్రక్కదే!" వేలుపెట్టి చూపించాను ఫోనుకేసి!

గబగబా ఫోను నెంబర్ తిప్పి, "విజయ్ నేనే! ఈవాళ రాత్రి మా ఫ్రెండ్స్ అందరూ మానస ఇంట్లో రాత్రంతా కంబైన్డ్ స్టడీ చేద్దామనుకుంటున్నాము? నేను రాత్రికి ఇంటికి రాను?"

అవతల లైనులో ఉన్న వ్యక్తి వద్దని వారిస్తున్నట్టున్నాడు.

"ఏం ప్రాబ్లమ్ లేదులే!" అంటూ ఆ అమ్మాయి తలను నిర్లక్ష్యంగా ఎగరేస్తూ... "అబ్బా? పెద్ద అన్నయ్యలా ఫోజు కొట్టకురా? రేపు పొద్దునే వచ్చేస్తాగా? అమ్మా వాళ్లు ఊరు నుంచి వచ్చేటప్పటికి, నేను ఇంట్లోనే ఉంటాను సరేనా? బై!" అంటూ ఫోన్ కట్ చేసింది టక్కున!

మళ్లీ ఇంకో నెంబరు తిప్పింది!!

అవతలి మనిషి ఎవరో కానీ ఫోను ఎత్తగానే ఆమె కళ్లలో కోటి మెరుపులు!!! ఆమె పెదాలు అందంగా, అల్లరిగా విచ్చుకున్నాయి. "మనోజ్!" అంటూ తుళ్లుతూ మాట్లాడుతూంటే అవతలి వ్యక్తి ఆమెకి ఎంతో ఇష్టమని ఇట్టే తెలిసిపోతుంది ఎవరికయినా!

"మనోజ్! అన్నయ్యను భలేగా బురిడీ కొట్టించానులే? మనిద్దరం ఊరు దాటి వెళుతున్నట్టు మనం వెళ్లిపోయాకా కానీ కనుక్కోడులే?" లీలగా వినపడుతున్నాయి మాటలు అలల్లాగ....

"ఓకే! కంగారేం లేదు? రాత్రి ఎనిమిదింటికల్లా స్టేషనులో ఉంటాను? ఎ.సి.త్రీ, సీటు నె.57, 58! అంతేగా! బై!" ఫోను పెట్టేసి, నాకు డబ్బులు పే చేసి వెళ్లిపోయింది, బిల్ తీసుకోకుండానే!

ఈ అమ్మాయి పేరేమిటో? కానీ ఎవిడితోనో రాత్రికి ఇంట్లోంచి పారిపోతోంది! అంతవరకు నాకు విషయం అర్థమైంది. ఆమె నడక, హొయలు, స్టైలు చూస్తే జీవితాన్ని చాలా లైటుగా తీసుకునే మనస్తత్వంలా అనిపిస్తోంది. ఎందుకని చెప్పకుండా వెళుతోందో? సరదాకా, పెళ్లి చేసుకోవడానికా? నిజంగా వాళ్లిద్దరి మధ్య ఉన్నది ప్రేమేనా లేక తాత్కాలికమైన ఆకర్షణా? అది అసలు జీవితాంతం ఉంటుందా? లేక నాలాగే, రాజు చేతిలో మోసపోయినట్టు. ఆమె జీవితం

కూడా మోడుబారిపోతుందా!!"

ఆ ఊహకే నాకు మనస్సంతా బాధతో నిండిపోయింది. "ఆ అమ్మాయికి చదువుంది. డబ్బుంది. తన మాటల్ని బట్టి చూస్తే ఇంట్లో స్వేచ్ఛ కూడా బాగానే ఉందనిపిస్తోంది? మరి ఎందుకిలా చేస్తోంది? థ్రిల్ కోసమా! టీనేజి వయసు నిజమైన ప్రేమను, దానిలో నిజాయితీని అసలు గుర్తించగలుగుతుందా? నా చేతిలో, ఆ అమ్మాయి చేసిన ఫోను నెంబర్ల బిల్లులు, నా ఆలోచనల్లాగే రెపరెపలాడుతున్నాయి!!

ఇద్దరు ముగ్గురు వచ్చి ఫోన్లు చేసుకు వెళ్లారు! అలాగే అన్యమనస్కంగా కూర్చుని ఉన్నాను!! ఇంతలో షాపు ముందు ఆటో ఆగింది! ఒకతను ఎస్.టి.డి. గదిలోకి వెళ్లి ఫోను తీస్తుంటే- యథాలాపంగా అతని వంక చూసి నేనొక్కసారిగా ఉలిక్కిపడ్డాను!

అతనే రాజు! నేను పదిహేడేళ్ల వయస్సులో ఉన్నప్పుడు ప్రేమంటూ నా చుట్టూ తిరిగిన నా కలల రాకుమారుడు! నేను అందాల రాశినని నన్ను పొగిడేసి, సినిమాల్లో హీరోయిన్ని చేస్తానంటూ నన్ను ఊరించేసి, నన్ను నట్టేట ముంచేసిన విలన్!

కోపం, దుఃఖం అన్నీ ఉవ్వెత్తున ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టాయి.

"హలో రెడ్డిగారు? నేను రాజును! హలో! నేనే రాజునండి!!"

"...."

"లేదు సార్! ఈ వర్షానికేమో మీ సెల్ అసలు కలవడం లేదు! వాయిస్ బ్రేక్ అవుతోంది!"

"...."

"సరుకు రెడీగా ఉంది సార్! అబ్బే బొంబాయి కాదు, రాజమండ్రి నుంచి తెచ్చాను! చూస్తే మీరు కళ్లు తిప్పుకోలేరు! అంత మంచి ఫిగర్స్!!!... 201, విశాల్ అపార్ట్‌మెంటు! రాత్రి పదిన్నరకల్లా వచ్చేయండి! ఉంటాను!"

అతను మాట్లాడే మాటలన్నీ నాకు లీలగా వినపడుతున్నాయి. నా ఒంట్లో రక్తం సలాసలా మరుగుతోంది. "ఇన్నేళ్లుగా ఇంకా ఎంతమంది జీవితాలతో ఇలా ఆడుకుంటున్నాడో!"

హఠాత్తుగా కరెంటు పోయింది. అతను గబగబా వచ్చి నా వంక చూడకుండానే టేబిల్ మీద బిల్ చూసి డబ్బులు ఇచ్చేసి వెళ్లిపోయాడు!

నాలో ఆవేశం, కోపం ఒక్కసారిగా లోపల్నుంచి ఎగదోసుకు వచ్చాయి! "ఎంత మేకవన్నెపులి! అసలు కన్నెపిల్లల అమాయకత్వంతో ఆడుకునే అధికారం వీడికెవడిచ్చాడు? ఇవాళ వీడివల్లే కదా, ఊరు కాని ఊళ్లో ఇలా షాపు పెట్టుకుని పొట్ట పోసుకుంటూ నేనిలా అనాథలా బతకాల్సి వచ్చింది! వీడినిలా వదలకూడదు. ఇప్పటికైనా వీడికి బుద్ధి చెప్పాల్సిందే!"

నా మనసును నన్ను నేనే శాంతపరచుకుంటూ పది నిముషాలు ప్రశాంతంగా కూర్చున్నాను! అంతే! చకచకా టెలిఫోను డైరీ తీసి లోకల్ పోలీస్ స్టేషనుకు ఫోను చేశాను!

"హలో ఇన్‌స్పెక్టరు గారున్నారా!" గొంతుమార్చి బొంగురుగా అడిగాను!!

"దయచేసి నా పేరు అడగవద్దు... కానీ సార్! మీకో ముఖ్యమైన సమాచారం ఇవ్వడానికి ఫోను చేస్తున్నాను! 201, విశాల్ అపార్ట్‌మెంటులో బ్రోతల్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాత్రి పదకొండు తర్వాత కనుక మీరు రెయిడ్ చేస్తే అసలు దోషుల్ని పట్టుకోగలుగుతారు!"

ఠక్కున ఫోన్ పెట్టేశాను! నా గుండెలు భయంతో కొట్టుకుంటున్నాయి.

"ఒకవేళ నా ఫోను నెంబరు టాప్ చేసి, నా ఎడ్రసు పట్టుకుని పోలీసులు ఇక్కడికే వస్తే!"

"ఎవరు మాకు ఫోను చేసింది అని అడిగితే, ఏం చెప్పాలి?"

"వస్తే రానీ! ఇది ఎస్.టి.డి. షాపు! ఎంతోమంది రోజూ కాల్స్ ఎన్నో చేస్తూనే ఉంటారు? ఎవరు చేస్తారో, ఏమిటో నాకెలా తెలుస్తుంది!" అలా పోలీసులకి చెప్పుకోవచ్చులెమ్మని మళ్లీ నాకు నేనే కొద్దిగా ధైర్యం చెప్పుకున్నాను.

లైటు ఆర్పి షట్టరు దించేశాను! షాపుకి తాళం వేయగానే నేను రోజూలాగ ఇంటికి వెళ్లలేదు! ఎందుకంటే నేను పూర్తిచేయాల్సిన పని ఇంకోటుంది!

ఇందాక నీలం రంగు చుడీదార్ అమ్మాయి తన ఇంటికి ఫోను చేసిన టెలిఫోను నెంబరు ద్వారా ఆ అమ్మాయి ఇంటి ఎడ్రసు బయలుదేరే ముందే కనుక్కున్నాను నేను! మా షాపుకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది వాళ్లిల్లు! నా చేతిలో ఆ ఇంటి అడ్రసు కాగితం భద్రంగా ఉంది. ఆ అమ్మాయి జీవితం నాశనం కాకుండా చేయడానికి, నా జీవితంలా సంఘర్షణమయం అవ్వకుండా ఉండటానికి!

☆ ☆ ☆

తెల్లగా పొడవుగా ఉన్న యువకుడు తలుపు తీశాడు.

"మీరు విజయ్?" అడిగాను.

"అవును నేనే" అంటూ "రండి!" మర్యాదగా లోపలికి ఆహ్వానించాడు!

"నాపేరు గౌతమి! మెయిన్ బజారులో ఎస్.టి.డి. షాపు నడుపుతున్నాను!" నెమ్మదిగా అన్నాను!

"అలాగా! కూర్చోండి!" అంటూ "మా నాన్నగారు, అమ్మగారు లేరు. ఊరెళ్లారు?" అన్నాడతను 'మీరెందుకు వచ్చారో' అన్నట్లుగా చూస్తూ.


"నేను వాళ్లకోసం రాలేదండీ. మీ చెల్లెలు గురించి!" ఎలా మొదలు పెట్టాలో తెలియక మాటలు తడుముకుంటూ ఆగాను!

"ఓహో! అలాగా? అయితే మీరు మా సునీత ఫ్రెండ్ అన్నమాట! నేను ఢిల్లీలో జాబ్ చేస్తున్నాను. రెండు రోజులైంది వచ్చి! మా సునీత ఫోన్ చేసింది. మానస అన్న ఫ్రెండు ఇంట్లో కంబైన్డ్ స్టడీ ఉందని! మీకేమైనా ఆ అమ్మాయి ఇల్లు తెలుసాండీ!" ఆత్రంగా అన్నాడతను!

చెల్లెలు పట్ల అతనికున్న ప్రేమ ప్రతీ అక్షరంలోనూ ధ్వనించింది!

"నేను తన ఫ్రెండ్‌ని కాదండీ!"

"ఓహ్" డిసప్పాయింట్ అయినట్టుగా చూశాడు!



## ఫర్జానా పాట్లు

ఈమధ్య సినిమా చాన్స్‌లు బానే వస్తున్నాయి అనుకుంటున్న సమయంలోనే ఫర్జానాకి ఓ సమస్య వచ్చి పడిందిట. మరేం లేదు, బరువు పెరగడం మొదలై పర్సనాలిటీలో ఆకర్షణ తగ్గడం సకాలంలోనే గ్రహించింది ఫర్జానా. దీంతో ఇప్పుడామె ఎక్కువ సమయం ట్రెడ్ మిల్‌పైనే గడుపుతోందిట. పెరిగిన బరువు తగ్గడమే కాకుండా, ఫిగర్ కరెక్షన్ కూడా చేసుకోవాలని తెగ హైరానా పడుతోందని ఆమె సన్నిహితులు చెవులు కొరుక్కుంటున్నారు.

"కానీ మీ చెల్లెల్ని ఇంతకుముందే చూశాను!" వాళ్ల చెల్లాయి మా షాపుకి రావడం, ఫోన్లు చేయడం అన్నీ వివరంగా అతనికి చెప్పాను!

అంతా విన్నాక అతను నిశ్చేష్టుడయ్యాడు!

"సునీతా! ఇంత చిన్నపిల్ల? ఇంట్లోంచి పారిపోతోందా?" అన్నాడతను నమ్మలేకపోతున్నట్టుగా, షాకయినట్టుగా!

"ఇంకో గంటలో ట్రైను వెళ్లిపోతుంది! జరగబోయేది కనుక మీరు ఆపగలిగితే మీ చెల్లాయి మీ ఇంట్లోనే ఈ రాత్రికి హాయిగా నిద్రపోతుంది!"

"ఎంతపని చేసింది? అసలు ఎవరో అతను??" కోపం, బాధ ధ్వనించాయి అతని గొంతులో!

"అతని ఫోన్ నెంబరు ఇది, ఆ వివరాలన్నీ మీరు తర్వాత కనుక్కోవచ్చు. కానీ ఆవేశానికన్నా ఇప్పుడు మీరు ఆచరణకే సమయాన్ని ఇవ్వాలి" అతను చటుక్కున లోపలికి వెళ్లి బట్టలు మార్చుకుని తాళం తీసుకుని బయటకు వచ్చాడు!

"నేను చెప్పింది నిజం కాకపోవచ్చు! నేను ఫోన్లో విన్నది కూడా అబద్ధం కావచ్చు! అసలు నేను మీ చెల్లాయి గురించి తప్పుగా చెప్పి ఉండవచ్చు. మీరు నా మాట నమ్మి వెంటనే బయలుదేరారంటే, మీలాంటి అన్నయ్య ఉండటం నిజంగా ఆ అమ్మాయి అదృష్టమే!" అన్నాను.

"ఏమాత్రం పరిచయం లేని ఓ మనిషి కోసం ఈ రాత్రివేళ మూడు కిలోమీటర్లు దూరం నుంచి నడిచి వచ్చి, ఒక జీవితాన్ని కాపాడటానికి మీరు తాపత్రయం పడుతుంటే, రక్తసంబంధం ఉన్న నేను ముందుకు రావడం పెద్ద గొప్ప విషయమేమిలెండి!!" అన్నాడతను.

"రండి! మిమ్మల్ని దింపి నేను స్టేషన్‌కి వెళతాను!" మళ్లీ వెంటనే అతనే అన్నాడు.

"వద్దండి, మీరు ముందు త్వరగా వెళ్లండి! ఆలస్యం అవుతుంది. నాకీ చీకట్లో ఇంటికి వెళ్లడం అలవాటే."

అతను రెండు చేతులు నావంక జోడించి వెళ్లిపోయాడు బైక్ మీద!!

కంట్లో చెమ్మ చేరుతుండగా నేనోవైపు, కంటికి రెప్పలా పెంచుకున్న చెల్లాయిని కాపాడుకోవడానికి అతనో వైపు సాగిపోయాం!!


ఇంటికి చేరగానే తాళం తీసి అలసటగా మంచంపైకి వాలిపోయాను! అయినా మనస్సు పొరల్లో ఏదో సంతృప్తి, ఇంకో గంటయితే వాళ్ల అన్నయ్య సునీతను ఇంటికి తీసుకొచ్చేసి ఉంటాడు, రాజును పోలీసులు అరెస్టు చేసి ఉంటారు. ఈ పండగనాడు ఏదోకటి సంచలనంగా జరగందే అంత సులువుగా నా జీవితం లోంచి ఎప్పుడు సాగిపోదు, ఎన్నో సంవత్సరాల నుంచి జరుగుతున్నది అదే! నా మనస్సు గతంలోకి పరుగు తీసింది!

☆ ☆ ☆

"గౌతమీ? నీకు ఇంక ఏ కష్టాలు ఉండవు. ఎలాగు మీ నాన్న పోయాడు. ఇక మీ పిన్ని పీడ ఈ దెబ్బతో నీకు వదిలిపోతుంది. ఇదిగో తీసుకో టిక్కెట్టు, సరిగ్గా రాత్రి పదింటికల్లా ట్రైను ఎక్కాలి? సరేనా? జాగ్రత్త!" రాజు చెబుతుంటే నా కన్నె మనస్సు ఆనందంతో తుళ్లితుళ్లి పడుతోంది.

"గౌతమీ స్టార్ సంస్థ జూబ్లీహిల్స్‌లో అతి పెద్ద సినిమా కంపెనీ. నిన్ను చూడగానే ఎంతో అందమైన హీరోయిన్ దొరికిందని వాళ్లు ఎగిరి గంతేస్తారు. త్వరలో నవ్వు పెద్ద హీరోయిన్‌వి అయిపోతావు. అప్పుడు నన్ను మర్చిపోవు కదా?"

రాజు ప్రేమగా నా కళ్లలోకి చూసి చెబుతుంటే నేను నిజంగా సినిమా స్టార్ అయిపోయినట్టు ఊహించుకుని ఉప్పొంగిపోయాను.



## 'మర్మయోగి' కోసం...

ఒక్క తమిళ సినిమా కోసం రెండు తెలుగు చిత్రాల్ని త్రిష వదులుకోవాల్సి వస్తోందిట. రవితేజతో ఒక సినిమా, వెంకటేష్‌తో మరో సినిమాలో నటించాల్సి వున్న త్రిష- కమల్‌హాసన్ 'మర్మయోగి'లో అవకాశం రావడంతో బల్క్ డేట్స్ కోసం ఈ రెండు సినిమాల్ని వదులుకోవాల్సి వస్తోందని బాధ పడుతోంది. 'మర్మయోగి' దాదాపు 200 రోజులు అవసరమవుతాయని, ఇలాంటి ప్రాజెక్టులో నటించే చాన్స్ వదులుకోకూడదని ఒక్క సినిమా కోసం రెండు సినిమాల్ని తిరస్కరించక తప్పడం లేదని వాపోతోంది త్రిష.

ఆరోజే పండుగ! అందరి కళ్లు ఎలాగో కప్పి ట్రైను ఎక్కి కూర్చున్నాను! కానీ రాజు ఎంతకీ రాలేదు! నాలో క్షణ క్షణానికి కంగారు, భయం పెరగసాగింది. ఇంతలో ట్రైను కదిలింది! నా గుండెలు అదిరిపోతున్నాయి. రాజు ఏమైపోయాడు? వేరే ఏ బోగిలోనైనా ఎక్కాడేమో? రాత్రి పన్నెండు దాటింది. బిక్కుబిక్కుమంటూ భయంగా తెల్లవార్లు అలాగే మొలకి ముడుచుకుని కూర్చున్నాను!!!

"ఏం చేయాలి?" ఈ ప్రశ్న అతి భయంకరంగా కనపడుతోంది. రాజు ఇలాగ నడిసముద్రంలో నిర్దాక్షిణ్యంగా నన్ను వదిలేస్తాడని అనుకోలేదు? "పోనీ వచ్చే స్టేషన్‌లో దిగిపోయి తిరిగి ఇంటికి వెళదామా? కానీ పిన్ని ఇంట్లోకి రానివ్వదు? నేను చేసింది ఎంత పెద్ద తప్పో నాకు ఇప్పుడు తెలుస్తోంది!!"

నాకు అసలు ఊరు తెలియదు, భాష అంతకన్నా తెలియదు. అయినా మొండి ధైర్యం తెచ్చుకుని, ఉన్న కొద్దిపాటి డబ్బుతో రాజు చెప్పిన కంపెనీకి అడ్రసు వెతుక్కుంటూ వెళ్లాను. ధైర్యంగా వేషం కోసం వచ్చానని చెప్పాను! అక్కడ ఎవ్వరూ నన్ను పట్టించుకోలేదు సరికదా చాలా చీదరించుకున్నారు. రాజు ద్వారా వచ్చానని చెబితే అందరు నన్ను చూసి వెకిలిగా నవ్వారు!! నిరాశతో నిస్పృహతో కృంగిపోయాను!

ఆఫీసు నుంచి బయటకు వచ్చి రోడ్డు పక్కన చెట్టు

నీడలో నీరసంగా కూలబడ్డాను. అప్రయత్నంగా చెంపల మీద నుంచి కన్నీళ్లు కారిపోతున్నాయి. భవిష్యత్తు అంధకారంగా కనపడుతోంది!

"అక్కా" గొంతు విని పక్కకి తిరిగాను.

"అక్కా! నాపేరు శంకర్!" ఆ ఫిలిం కంపెనీలో కాఫీలు అందిస్తున్న అబ్బాయి నా వెనకే వచ్చి తనకు తాను నాకు పరిచయం చేసుకున్నాడు.

"రాజు అస్సలు మంచివాడు కాదక్కా! ఊళ్ల నుంచి అమాయకమైన అమ్మాయిల్ని సినిమా వేషాలని ఆశపెట్టి నమ్మించి ఇక్కడికి తీసుకువచ్చి చివరికి వ్యభిచార గృహాల్లో అమ్మేస్తాడు. వాడో బ్రోకర్ అక్క!"

"నే... నేనమ్మను, రాజు అలాంటివాడు కాదు!" గట్టిగా అన్నాను!

## ఏంటో మరి!

**త**మిళ చిత్రం 'మల్లన్న'లో విక్రమ్‌కి జంటగా నటిస్తున్న శ్రియ ఇటీవల నిర్మాతకి షాక్ ఇచ్చింది. ఎలాగంటారా? ఈ సినిమాకిగాను మెక్సికోలో **60** రోజుల పాటు షూటింగ్ ప్లాన్ చేసుకున్న నిర్మాత, దర్శకులు **40** రోజులపాటు షూటింగ్ చేసారు. ఇంకా **20** రోజులు అక్కడే వుంటే గానీ ఆ దేశంలోని సీన్లు పూర్తి కావట. కానీ అకస్మాత్తుగా శ్రియ తన పెట్టేబేడా సర్దుకుని ఇండియా వెళ్లిపోయిందిట నిర్మాతలు ఎంత బతిమిలాడినా. ఆమె ఎందుకలా సడెన్‌గా వెళ్లిపోయిందో కారణం తెలీక, మిగతా షూటింగ్ గురించి తలలు పట్టుక్కూర్చున్నారట నిర్మాత, దర్శకులు. ప్చ్!

"అక్కా! నన్ను నమ్ము! నేను నిజమే చెబుతున్నాను!"

"రాజు చాలా మంచివాడు, నిజానికి నాతోనే నిన్న రాత్రి రావల్సినవాడు, అసలు ఏమై పోయాడో! ఎందుకు రాలేదో? నాకు అర్థమే కాకుండా ఉంది!!"

"అది నీ పాలిటి వరమే అయ్యింది అనుకో అక్కా! రాజు బారి నుండి చాలా అదృష్టంగా బయటపడ్డావు!" జాలిగా అన్నాడు, నాకేసి చూస్తూ!!

"అసలు నువ్వు చెప్పేది ఎంతవరకు నిజమో? అసలు నాకు అంతా అయోమయంగా ఉంది!"

శంకర్ కళ్లలో నీళ్లు! "అక్కా! మా అక్క కూడా నీలాగే ఉండేది. ఇలాగే ఒకడి ప్రేమ వలలో పడి మోసపోయి ఆత్మహత్య చేసుకుంది! నన్ను నమ్ము అక్కా! నువ్వు అలా కాకూడదు!!! అక్కా! మీ ఊరు వెళ్లిపో!" వాడు దీనంగా అంటుంటే చలించిపోయాను. వాడి మాటల్లో నిజాయితీ కనిపించింది!

నిస్సహాయంగా నరికిన మానులా అలాగే కూర్చుండిపోయాను చాలాసేపు ఏడుస్తూ!!!

"అక్కా! బాధ పడకులే! మా ఇల్లు ఇక్కడికి దగ్గరనే! దా వెళదాం! రాత్రి ట్రైనుకి మీ ఊరెళ్లిపోదువుగానిలే!" అంటూ శంకర్ తన ఇంటికి తీసుకెళ్లాడు! వాళ్ల ఇంటికి వెళ్లాక రాజు నిజస్వరూపం ఏమిటో బాగా తెలుసుకున్నాను. నా మనస్సు మొద్దుబారిపోయింది!

ఏం చేయాలి? ఏ ముఖం పెట్టుకుని మళ్లీ వెనక్కి ఊరెళ్లాలి? అసలు పిన్ని నన్ను ఇంట్లోకి తిరిగి రానిస్తుందా? కానీ అంతకన్నా నాకు వేరే మార్గమేమీ లేదు!

అవమాన భారంతో మర్నాడు బయలుదేరి ఇంటికి వెళ్లాను. "సవతి తల్లినని కాదు, అసలు నా సొంత కూతురీ పని చేసినా నేను చస్తే నా ఇంట్లోకి రానివ్వను! ఈ లేచిపోయిందానికి నా ఇంట్లో ఎప్పటికీ స్థానం లేనే లేదు" అంటూ నా ముఖం మీదే పిన్ని తలుపులు వేసేసింది. ఊరంతా నన్ను వెలివేసినట్టు చూశారు!

ఏడ్చి ఏడ్చి ఇంటి గుమ్మం ముందు సొమ్మసిల్లి పడిపోయాను!

"నాన్నా! నువ్వే బతికి ఉంటే నా బతుకిలా అయ్యేదా? అసలు నేనిలా పారిపోయేదాన్నా!"



నాన్నను తలుచుకుని కుళ్లికుళ్లి ఏడ్చాను, "నీ పిరికితనం వల్ల నా జీవితం నాశనం అయ్యింది నాన్నా!" అంటూ.

"నేను చెడిపోలేదు! నేను చేసిన తప్పు తెలుసుకున్నాను. ప్రాయశ్చిత్తం చేసుకుంటాను! పిన్ని తలుపు తీయి! పిన్ని, నన్ను ఇంట్లోకి రానివ్వు!" అంటూ ప్రాధేయపడినా, నా ఘోష అరణ్యరోదనే అయ్యింది.

ఆఖరికి మొండిగా పట్టుదలగా లేచాను, నా బతుకును నేనే మంచి మార్గంలోకి తీర్చిదిద్దుకోవాలన్న సంకల్పంతో ఈసారి మళ్లీ మా ఇంటిని, ఊరుని వదిలేశాను!

☆ ☆ ☆

శంకర్, అతని తల్లిదండ్రులు నాలో చనిపోయిన వాళ్ల అమ్మాయిని చూసుకున్నారు. నాకు ఎంతో అండగా నిలిచారు. వాళ్ల సాయంతో ఈ ఎస్.టి.డి. ఫోను షాపు పెట్టుకున్నాను. గతానికి సమాధి కట్టడానికి ప్రయత్నం చేస్తూ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుకుంటూ నాకంటూ అస్తిత్వాన్ని నిలుపుకుంటూ ఇలా బతుకుతున్నాను!!!

రాజును మటుకు నేను మళ్లీ కలవలేదు. కానీ ఆరోజు అతన్ని వేరే కేసులో అరెస్టు చేసి జైల్లో పెట్టారని తర్వాత నాకు చాలా ఆలస్యంగా తెలిసింది. అందుకే అతను నన్ను ట్రైన్‌లో కలవలేకపోయాడు! మళ్లీ ఇన్నాళ్లకు అతన్ని నేను ఇదే చూడటం! అతనికి మటుకు గట్టి శిక్ష పడాలి! ఆలోచిస్తూ నిద్రలోకి జారాను.

☆ ☆ ☆

మర్నాడు షాపుకి వెళ్లగానే గబగబా పేపరు తెప్పించుకుని చదివాను!

రాజును, మరో ఇద్దరు విటుల్ని పోలీసులు రాత్రే అరెస్టు చేశారన్న వార్త చదవగానే ఆనందం పట్టలేకపోయాను. పదే పదే ఆ వార్త చదువుకుని చాలా సంతోషపడ్డాను. 'నాలాంటి ఆడపిల్లలకి భ్రమల్ని కల్పించి వాళ్ల జీవితాల్ని నాశనం చేస్తున్నందుకు వాడికి గట్టి శిక్ష పడాలి! అవును, మరి సునీత సంగతేమయ్యిందో!' అనుకుంటుండగా విజయ్ నా కళ్లముందు ప్రత్యక్షమయ్యాడు!

"గౌతమిగారూ! చాలా థ్యాంక్స్! మీరు ఊహించింది నిజమే అయ్యింది? రాత్రి స్టేషన్నుంచి సునీతకు నచ్చచెప్పి ఇంటికి తీసుకువచ్చాను. అమ్మా వాళ్లూ పొద్దున్నే వచ్చేశారు? మీరు మా పరువు కాపాడారు. మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేము!" అతని గొంతులో ఆనందం!

"కూర్చోండి, ఇందులో నేను చేసిందేమీ లేదు! కానీ తనని గట్టిగా కోప్పడకండీ! అసలు విషయం ఏమిటో కనుక్కుని నెమ్మదిగా నచ్చచెప్పండి!" అన్నాను నేను!!

"నిజానికి అసలు అలాంటి నిర్ణయం ఎలా తీసుకుందో నాకు అర్థమే కావడం లేదు!"

"పోనీలెండి, జరిగిందేదో జరిగిపోయింది. చిన్నపిల్ల! నిజంగా ఆ అబ్బాయి మంచివాడే అయితే అదృష్టమే అనుకోవాలి! కాకపోతే యవ్వనం ఎప్పుడు నాచు మీద నడకే? ఊహించుకోవడానికే భయంగా ఉంది!! అయినా చిన్న పొరపాటు చాలు, మనిషి పతనమవ్వడానికి!"

అతను ఏకీభవిస్తున్నట్లుగా తలూపి, "నేను ఢిల్లీలో దూరంగా ఉండటం, మా పేరెంట్స్ గారాబం అన్ని తనని ఇలాంటి తప్పు దోవ పట్టించాయి?" ఆలోచిస్తూ అన్నాడు.

మనిషి కష్టంలో ఉన్నప్పుడు చిన్న ఆలంబన దొరికినా ఆత్రంగా అందుకుంటాడు. ఏమాత్రం పరిచయం లేని నన్ను, అతను ఎంతో ఆప్తురాలిగా భావించి తన ఇంటి విషయాలు నాతో చెబుతుంటే నాకేం అంత ఆశ్చర్యం అనిపించలేదు!!

"నేను కూడా మీ సునీతలాగా తప్పటడుగు వేసేదాన్నే! అదృష్టం కొద్దీ బయటపడి, నా తప్పును తెలుసుకుని నన్ను నేను సరిదిద్దుకున్నాను. అదే మీ సునీతకి మీరందరు ఇంతమంది అండగా ఉన్నారు. ఇంకేం ప్రాబ్లమ్ లేదు!" అనునయంగా అన్నాను.

"ఆ మనోజ్ మంచివాడే అంటుంది! చూడాలి!" రాత్రంతా నిద్ర లేని ముఖంతో ఆలసటగా అన్నాడు.

"అదే అయితే అంతకన్నా అదృష్టం ఏముంది? అన్నీ వివరంగా కనుక్కోండి! పెద్దలు పూనుకొంటే ప్రేమ గెలుస్తుంది. పెళ్లి కుదురుతుంది!" నవ్వాను చిన్నగా.

నా వంక ఎడ్మైరింగ్‌గా చూస్తూ, "నిజంగా మీది చాలా పాజిటివ్ థింకింగ్! అందరు ఆడవాళ్లు మీకులాగా ఉంటే...!"

"చాల్లెండి!" కట్ చేశాను!

"వస్తానండీ! మీరు చేసిన మేలు ఈ జన్మలో నేను మరిచిపోలేను!" కృతజ్ఞతగా అన్నాడు వెళ్లిపోతూ!

☆ ☆ ☆

ఇప్పుడీ పండుగ అంటే నాకు చాలా ఇష్టం! ఎందుకంటే నన్ను, విజయ్‌ని ఆ పండుగే కదా కలిపింది! నా కలలన్నీ పండి నా మెడలో మాంగల్యం మెరవడానికి కారణమైన పండుగ, అదే కదా!

ఆ పండుగ నాడు మొదలైన మా ఇద్దరి పరిచయం, గాఢమైన స్నేహంగా మారి మళ్లీ ఏడాది తిరిగి వచ్చేటప్పటికి మొగ్గలు తొడిగి ప్రేమ పూలు పూసింది! నా జీవితంలోకి తిరిగి వసంతం వచ్చి, ఆనందాలు నింపి ప్రేమ హరివిల్లు విరిసింది!

విజయ్ పెళ్లి ప్రపోజల్ తెచ్చినప్పుడు నా గతమంతా ఏమీ దాచకుండా విడమరిచి చెప్పి, అతన్ని ఆలోచించుకుని మరీ ముందడుగు వేయమన్నాను!


"మా సునీత జీవితాన్ని నేను సానుభూతితో అర్థం చేసుకుని పరిష్కరించాను! మరి అది నీకూ వర్తిస్తుంది! అయినా ఇందులో నేను ఎవర్నీ ఉద్ధరించేదేమీ లేదు! ఏ పెళ్లికైనా పునాది నమ్మకం! నేను నిన్ను నమ్మాను! నిన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాను! నీకు కూడా నేను నచ్చానో లేదో ఆలోచించుకుని మరీ చెప్పు! అప్పుడే మన పెళ్లి!!" కళ్ల నిండా వర్షిస్తున్న ప్రేమతో అన్నాడు!

అతను అడిగిన తీరుకు మంత్రముగ్ధురాలినైపోయాను! జవాబివ్వడానికి ఆనందంతో మనసు మూగపోయినట్టయిపోయింది!

"గౌతమీ! ముక్కు ముఖం తెలియని మనిషి బాగు కోసం ఎంతో తపించిపోయిన నువ్వు, అయిన వాళ్లకోసం ఇంకా ఎంతో ప్రేమను పంచగలవని నమ్మి, నిండు మనస్సుతో నిన్ను నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను!" ఆర్తిగా అన్నాడతను రెండు చేతులు నావైపు చాస్తూ!!!

అతనిలోని ప్రేమకు తల వంచాను! ఇటువంటి అద్భుతమైన ఆహ్వానం కన్నా ఏ అమ్మాయికైనా జీవితంలో కావల్సిందేముంటుంది! నా జీవితం విజయ్‌తో అత్యద్భుతంగా సాగుతోందని ఇక వేరే చెప్పేదేముంది!!!!

☆



## తెలుగులో మల్లిక!

బాలీవుడ్ సెక్సీతార మల్లికా షెరావత్ 'దశావతారం' సినిమాతో తమిళంలోకి అడుగుపెట్టింది. ఇప్పుడు తెలుగులో కూడా కనిపించబోతోంది. మహేష్ బాబు హీరోగా నిర్మాణం కానున్న 'వరుడు' సినిమాలో మల్లిక ఐటమ్ నంబర్ వుండవచ్చని సినీ వర్గాలు అంటున్నాయి. డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఆల్రెడీ పరిచయమైన మల్లికా షెరావత్ డైరెక్ట్ తెలుగు సినిమాలో కనిపిస్తుందంటే ఆ సినిమాకి ఓ ఆకర్షణే మరి!